# ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోన్న బిజెపి ప్రభుత్వం

**- ఆదానీకి మోడీ అండ**

**- డబుల్ బెడ్ రూం లు పంపిణీ చేయకపోతే పేదలతో కలిసి ఆక్రమిస్తాం**

**: కరీంనగర్ జిల్లా సిపిఐ కార్యదర్శి మర్రి వెంకటస్వామి**




కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని కరీంనగర్ జిల్లా సిపిఐ కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రైవేట్ పరం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగిస్తోందన్నారు. గురువారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆదానీకి అండగా మోడీ ఉన్నారని, లక్షల కోట్ల సంపదను ధారాదత్తం చేయడమే కాకుండా దేశవ్యాప్తంగా అనేక బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తూ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారన్నారు. పేదలు, రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను నిర్బంధంగా వసూలు చేస్తోన్న ప్రభుత్వం, బడా పారిశ్రామిక వేత్తల లక్షల కోట్ల రుణాల విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఆదానీ స్టాక్స్ వ్యవహారం పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని వెంకటస్వామి డిమాండ్ చేశారు. బిబిసి కార్యాలయం పై ఐటీ దాడులు చేయడం వెనుక మోడీ ప్రభుత్వ హస్తం ఉందని, ప్రజల సమస్యలను, ప్రభుత్వ అవినీతిని బయటకు తెస్తున్న పత్రికలపై, మీడియాపై ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల స్వేచ్ఛను హరిస్తున్న పాలకులపై ప్రజలు తిరగబడి పోరాడాలని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెచ్చాడో చెప్పాలన్నారు. తాను ఎన్నికై నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా నియోజక వర్గానికి కేంద్రం నుండి ఎన్ని నిధులు తెచ్చి ఏమి అభివృద్ధి సాధించారో ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా తన మాటల గారడీతో కాలయాపన చేస్తున్నారని వెంకటస్వామి విమర్శించారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీని చేయకపోవడం బాధాకరమని పోడు భూములపై సీపీఐ గత అనేక సంవత్సరాలుగా పోరాడుతుందని, భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు,పేదవారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి మాత్రం పోడు భూముల సాగుదారులపై ఆంక్షలు విధిస్తూ పోరాటాలు నిర్వహించిన వారిని చులకన చేసి మాట్లాడడం సరైనది కాదన్నారు. దేవాలయాలకు వందల కోట్ల రూపాయలు ప్రకటించడం తమకేం అభ్యంతరం లేదని, కనీసం ఉండడానికి ఇల్లు లేని,ఇంటి స్థలం లేని నిరుపేదలు అనేకమంది ఉన్నారని వారికి నీడ కల్పించాలనే ధ్యాస లేకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి యేండ్లు గడుస్తున్నా వాటిని పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదో అర్థం కావడం లేదన్నారు. శివరాత్రి తర్వాత డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులైన పేదలకు కేటాయించకపోతే నిరుపేదలందరినీ ఏకం చేసి సీపీఐ ఆధ్వర్యంలో ఇండ్లను పేదలతో కలిసి ఆక్రమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపెల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, బామండ్లపెల్లి యుగేందర్, బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ ఫర్ సేవ చిగురు సేవా సంస్థ ఆధ్వర్యంలో..

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



ఇల్లందకుంట, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు యూత్ ఫర్ సేవ చిగురు సేవా సంస్థ హనుమకొండ వారి ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒక్కో విద్యార్థికి 1500 రూపాయల విలువ చేసే స్కూల్ బ్యాగులను వాలంటీర్లు నద్దునూరి కుమార్, శివ కుమ్మరి, ప్రవీణ్ కుమ్మరిలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూగల విజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, పద్మా రెడ్డి, సరోజన, రాజేష్ బాబు, అశోక్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ అఖిల్ మహాజన్ ను కలిసిన కార్మిక సంఘం నాయకులు భాస్కర్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు అక్కెనపల్లి భాస్కర్ గురువారం ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం స్థలాన్ని కొందరు నాయకులు విక్రయించేందుకు యత్నిస్తున్నారని, స్థలారన్ని కాపాడాలని కోరారు. దీనికి స్పందించిన ఎస్పీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ స్టేటస్

**విద్యాసంస్థల చైర్మన్ సాగర్ రావు**




తిమ్మాపూర్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలకు యుజిసి అటానమస్ స్టేటస్ ను ప్రకటించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు తెలిపారు. కరీంనగర్ జిల్లాలోనే అటానమస్‌గా యుజిసి గుర్తింపునిచ్చిన కళాశాల తమది కావడం గర్వకారణమన్నారు. విలువలతో కూడిన విద్యను అందించడంలో ఎప్పుడు తమ కళాశాల ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో సాగర్ రావు మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదాను 2022-23 విద్యా సంవత్సరానికి ప్రకటించినట్లు తెలిపారు. ఈ అటానమస్ స్టేటస్ జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలకు 10సంవత్సరాల పాటు ఉంటుందని పేర్కొన్నారు. కళాశాలలో అద్భుతమైన హార్డ్ వర్క్, అంకితభావంతో కూడిన సిబ్బంది తో టీంవర్క్ గా ముందుకు వెళ్లడంతోనే అటానమస్ హోదాను సాధించామన్నారు. కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను, అత్యాధునిక టెక్నాలజీని అందిస్తున్నామని తెలిపారు. జ్యోతిష్మ తిలో చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో వివిధ స్థాయిల్లో ఉద్యోగా లు సాధించారన్నారు. 1997 సంవత్సరంలో ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు అంచెలంచెలుగా ఎదగడానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఇచ్చిన సహకారమే కారణమన్నారు. 2021లో జ్యోతిష్మతి కళాశాల ఎన్ఏఏసి 'ఏ' గ్రేడ్, 2022లో ఏన్ బిసి, 2023 సంవత్సరంలో అటానమస్ స్టేటస్ సాధించినట్లు ఆయన తెలిపారు. అనంతరం కళాశాల సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి మాట్లాడుతూ ఐఐటి, ఎన్ఐటి, ఐఐఐటి ప్రొఫెసర్ లు,ఇండస్ట్రియ ల్ పరిజ్ఞానం ఉన్న, ఒరాకిల్, టిసిఎస్, డిఎంఆర్ఎల్, మాస్ చిప్ బహుళ జాతి సంస్థల నిపుణులతో సిలబస్ ను సిద్ధం చేసి విద్యార్థుల కు అందించనున్నట్లు ఆయన తెలిపారు. తద్వారా విద్యార్థులు పరిశ్రమ లకు సంసిద్ధమయ్యే సిలబస్ ను చదువుకొని అత్యధికంగా ప్లేస్మెంట్లో ఉద్యోగాలు సాధించ డానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం 12.3 లక్షల ప్యాకేజీ తో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. తమ కళాశాల అనేక గోల్ మెడల్స్, జేఎన్టీయూహెచ్ రీసర్చ్ సెంటర్ ను సాధించి సక్సెస్ దిశలో దూసుకెళుతుందని తెలిపారు. అటానమస్ ద్వారా విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని స్వంత సిలబస్, రిసర్చ్ రంగంలో అనేకమైన ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే కళాశాలలో మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్స్ ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని కోర్సులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో కళాశాల సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, కళాశాల డీన్ పికె.వైశాలి, హెచ్ఓడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## బ్యాడ్మింటన్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): కరీంనగర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు అంబటి జోజిరెడ్డి, బ్యాడ్మింటన్ క్రీడాకారులు గుంటపల్లి స్వామి, రాజేందర్ రెడ్డి, గాజుల ప్రభాకర్, కందుకూరి శంకర్, రాజ్ కుమార్, నామ రమేష్, దామోదర్, సురేష్ కుమార్, శివ శంకర్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

